జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బదిలీ


ఆదర్శ్ రాజేంద్రన్


మేఘ స్వరూప్


నిదియా దేవి

రాయచోటి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఆదర్శ్ రాజేంద్రన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ సీఈవోగా పనిచేస్తున్న రాజేంద్రన్‌ను అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను పదోన్నతిపై అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా గత ఏడాది ఏప్రిల్‌లో నియమించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పీలేరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఈయన విధులు నిర్వహించారు. ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేశారు. కాగా మదనపల్లె మున్సిపల్ కమిషనర్‌గా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వై.మేఘస్వరూప్ నియమితులయ్యారు. అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈయనను మదనపల్లెకు బదిలీ చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్‌గా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వైకుం నిదియా దేవిని నియమించారు. అనంతపురం జిల్లా పరిషత్ సీఈవోగా పనిచేస్తూ రాజంపేటకు బదిలీ అయ్యారు.

ప్రజలకు అందుబాటులో నిత్యావసర కౌంటర్లు

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 20: నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలకు అందుబాటులోఉండేవిధంగా ప్రభుత్వం కౌంటర్లను ఏర్పాటు చేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం రూ.55.85 ఉండగా దానిని రూ.49కే ప్రజలకు అందిస్తోందన్నారు.

అలాగే కందిపప్పు రూ.174 ఉండగా దానిని తగ్గించి 160 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. రాయచోటిలోని విశాల్ మెగామార్ట్, రైతుబజార్, వ్యాపారాల సముదాయం, మార్కెట్‌వీధి, మదనపల్లెలోని విశాల్ మెగామార్ట్, బసినికొండలోని రిలయన్స్ స్మార్ట్‌స్టోర్, ఎస్‌బీఐ కాలనీలోని రిలయన్స్ స్టోర్, అప్పారావువీధిలోని శ్రీరాధాకృష్ణ ట్రేడర్స్, రాజంపేటలోని శ్రీలక్ష్మి నరసింహ రైస్‌మిల్ ప్రాంతాల్లో వీటిని ప్రజలకు తక్కువ ధరకు అందిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు నిలుపుదల

సవరించిన అసైన్డ్‌మెంట్ యాక్టు 1977 ప్రకారం 20 సంవత్సరాలు రైతుల అనుభవంలో ఉన్న డీకేటీ భూముల రిజిస్ట్రేషన్లు ఈ ఏడాది జనవరి నుంచి జరుగుతూ నిన్నటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్లకు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో ఒక్కసారిగా జిల్లావ్యాప్తంగా ఈ రిజిస్ట్రేషన్లకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మార్గంలో డీకేటీ పట్టాలు పొందిన అక్రమార్కులకు ఆశనిపాతంగా మారింది.

● సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలు
● నిన్నటి నుంచి నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
● అక్రమార్కులకు ఆశనిపాతం



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు వ్యవసాయం చేసుకోవడానికి భూములు పంపిణీ చేసింది. తొలినాళ్లలో ఎటువంటి నిబంధనలు లేకుండానే భూమిలేని నిరుపేదలు, మాజీ సైనికోద్యోగులు, ప్రకృతి విపత్తుల బాధితులకు నిరుపయోగంగా ఉన్న భూములను పంపిణీ చేసింది. వర్షాధారం 5 ఎకరాలు, వెట్‌ల్యాండ్ 2.5 ఎకరాలు చొప్పున భూపంపిణీ జరిగింది. అయితే ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను లబ్ధిదారులు అమ్ముకోవడం, ఇతరుల వద్ద తాకట్టు పెట్టడం వంటి సంఘటనల నేపథ్యంలో 1952 జూన్ తర్వాత పంపిణీ చేసిన భూములపై ప్రభుత్వం నిబంధనలను విధించింది. ఈ మేరకు 1977లో అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలను నిషేధిస్తూ అప్పట్లో రాష్ట్రప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం అటువంటి డీకేటీ భూములను నిషేధిత జాబితాలో (22ఏ) చేర్చారు. అయితే ఈ చట్టం తెచ్చి సుమారు 47 సంవత్సరాలు అవుతోంది. ఇన్ని సంవత్సరాల నేపథ్యంలో ఆ డీకేటీ భూములు చాలా వరకు నిజమైన లబ్ధిదారుల చేతుల్లో లేవు. సరైన సాగు నీటి వనరులు లేక బీళ్లుగా ఉన్నాయి. పాలికేళ్లుగా వేగంగా జరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో డీకేటీ భూములు సాగుకు నోచుకోవడం లేదు. అయినా ఈ భూముల క్రయ, విక్రయాలు జరపకూడదనే ఆంక్షల నేపథ్యంలో ఈ భూముల హక్కుదారులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదు. ఈ నేపథ్యంలో చాలా సంవత్సరాలుగా డీకేటీ భూముల లబ్ధిదారులకు ఆ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలనే డిమాండ్ ఉంది. అయితే ఈ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల చేతుల్లో నుంచి ఈ భూములు ధనవంతులు, అగ్రవర్ణాలపరమవుతాయనే ఆందోళనలూ ఉన్నాయి. దీంతో ఈ ప్రతిపాదనలు చట్ట రూపం దాల్చలేదు. అయితే వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ యాక్టు 1977ను సవరించింది. 2023 డిసెంబరులో జీవో 596 జారీ చేసింది. దీని ప్రకారం డీకేటీ భూముల లబ్ధిదారులకు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పించింది. దీని వల్ల ఇక నుంచి నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఆ భూములను అమ్ముకోవచ్చు. తాకట్టు పెట్టుకోవచ్చు. చట్టసవరణ సందర్భంగా ప్రభుత్వం పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో ఎటువంటి ఆటంకాలు లేకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

జిల్లాలో ఫ్రీహోల్డ్ కింద లక్ష ఎకరాలు

ఎటువంటి వివాదాలు లేకుండా లబ్ధిదారుల అనుభవంలోనే 20 సంవత్సరాలుగా ఉన్న భూములు జిల్లాలో సుమారు లక్ష ఎకరాలను మొదటి విడతగా నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అసలైన లబ్ధిదారులు కాకుండా వాళ్ల వారసులు, ఇతరత్రా కారణాలతో ఉన్న భూములను మరో విడతలో నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియ జరగనుంది. ఇలా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల్లో ఇప్పటికి జిల్లాలో సుమారు 5 వేల ఎకరాల భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. మిగిలిన భూములు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉంది. అయితే ఈ చట్టం రావడంతో వైసీపీ నాయకులు వేలాది ఎకరాలు డీకేటీ భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం. అదే సమయంలో పలువురి పేదల భూములను కూడా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రాగానే ఈ భూముల వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అదే సమయంలో ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం రూపొందించిన కొన్ని నిబంధనలను గమనిస్తే వైసీపీ నాయకులకు మేలు కలిగే విధంగా ఉన్నాయనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నఫళంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన డీకేటీ భూముల రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ తెచ్చిన జీవో ద్వారా నిజమైన పేదలకు ఎంత వరకు మేలు కలుగుతోంది..? వైసీపీ నాయకులకు ఏ మేర లబ్ధి చేకూరుతోంది? అనే కోణంలో విచారణ జరపనున్నట్లు తెలిసింది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.



Illustration by LegalDesk.com

వైభోగం.. సౌమ్యనాథుడి కల్యాణం

నందలూరు, జూలై 20: సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం చూచువారికి చూడముచ్చటగా జరిగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఆలయ అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ బృందంచే సౌమ్యనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకకు ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపైన ఆశీనులు చేశారు. పండితుల మంత్రోచ్చారణలు, పసుపులేటి శివశంకర్ వ్యాఖ్యానంతో భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. ఉదయం అభిజిత్ లగ్నంలో పాంచరాత్ర ఆగమ ప్రకారం వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాల క్రతువులను నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట టీడీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, మేడా విజయశేఖర్‌రెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వీరందరినీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణమహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి గజ వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్యాణమహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట సామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలందించారు.



సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు అమ్మవారి మాంగల్యాన్ని చూపుతున్న పండితులు

కల్యాణానికి హాజరైన ప్రముఖులు

కల్యాణ మహోత్సవానికి ఆర్టీసీ రీజనల్ మాజీ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు, డీఎస్పీ చైతన్య, ప్రముఖ నటుడు, దర్శకుడు తోట వేణుగోపాల్, జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ యెద్దల విజయసార్, టీడీపీ నాయకులు పల్లె సుబ్రమణ్యం, గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్నలు హాజరయ్యారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు


బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రథంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.


స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



ధర్మాదాయంలో అధర్మం

● పర్యవేక్షణాలోపంతో మాన్యం భూములు అన్యాక్రాంతం
● లీజుకు తీసుకుని ఇసుక తోడేసి అమ్మేసిన లీజుదారు
● రూ.లక్షలు ప్రభుత్వాదాయానికి గండి
● బి.కొత్తకోట మాన్యం భూములలో అధికారి లీలలు
● ఫిర్యాదులు వెళ్లినా చర్యలు శూన్యం


నల్లగంగమ్మ మాన్యం భూములలో ఉన్న ఇటుక బట్టీలు


మట్టి తోడేయడంతో ధ్వంసమైన చెన్నకేశవ స్వామి మాన్యం భూమి

బి.కొత్తకోట, జూలై 20: దేవదాయ ధర్మాదాయ శాఖ అనగానే నీతి, నియమాలు, నిబద్ధత, నిస్వార్థం, భక్తిభావం గుర్తుకు వస్తాయి. ఈ శాఖలో పనిచేసే అధికారులు కూడా అలాగే ఉంటారని, ఉండాలని భావిస్తాం. దేవుడి మాన్యాలు, ఆస్తులను ఆయా ఆలయాలలో దూపదీప నైవేద్యాలతో పాటు నిర్వహణ, అభివృద్ధి కోసం పూర్వం కేటాయించారు. ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల వాణిజ్య సముదాయాలు, భూముల నిర్వహణ, రక్షణ బాధ్యతలు ఆ శాఖ ప్రతినిధులు చూస్తుంటారు. ఆదాయంతో పాటు ఆస్తుల రక్షణకు బాధ్యత వహించాల్సిన వ్యవస్థ బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో విమర్శల పాలవుతోంది. అవినీతి ఆరోపణలు ఆరోపణలు ఎదుర్కొంటోంది.

బి.కొత్తకోటలో ఆలయాలకు రూ. కోట్ల ఆస్తులు

నగర పంచాయతీ పరిధిలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి, చౌళేశ్వరస్వామి, నల్లగంగమ్మ, ఆంజనేయస్వామి తదితర ఆలయాలకు రూ.కోట్ల ఆస్తులు ఉన్నాయి. వాణిజ్య స ముదాయాలు, వ్యవసాయ భూములు, వ్యాపార అవసరాలకు పనికివచ్చే భూములను పారదర్శకంగా వేలం పాట లు నిర్వహించి, వచ్చిన ఆదాయాన్ని ఆయా ఆలయాల అభివృద్ధి, దేవదాయ శాఖలకు ఉపయోగపడేలా చూడాల్సి ఉంది. ఈ ఆలయాలకు విలువైన, ఉపయోగకరమైన భూములతో పాటు రూ.కోట్ల డిపాజిట్లు సైతం ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే వడ్డీని సైతం వినియోగించుకోవచ్చు.

మట్టి తోడేసి మాన్యం భూములు ధ్వంసం

పట్టణ శివారులోని ఆలేరువాగు పక్కన ఉన్న చెన్నకేశవ స్వామి మాన్యం భూమి సర్వే నెంబరు 1840, 1726లలో 11 ఎకరాలు లీజుకు తీసుకున్న వ్యక్తి వ్యవసాయం చేయకుండా తన సొంత ఆస్తిలాగా ఆ భూమిలో మట్టి తవ్వకాలు జరిపి సుమారు రూ.2 కోట్ల విలువైన మట్టిని తరలించేశాడు. అప్పట్లో నిర్విరామంగా జరిగిన ఈ తవ్వకాలతో దాదాపు మూడెకరాల భూమి 25 అడుగుల మేర గుంతపడిపోయి ధ్వంసం అయిపోయింది. ఈ దోపిడీలో ఈవో కుమ్మక్కైనట్లు దేవదాయ శాఖ కమిషనర్‌తో పాటు రీజినల్, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ కూడా జరిగింది. అయినా చర్యలు లేవు. ధ్వంసం అయిన భూమి పనికి వచ్చే పరిస్థితి లేదు.

ఇష్టారాజ్యంతో ఆలయ ఆదాయానికి గండి

బి.కొత్తకోట దేవదాయశాఖ అధికారి పనితీరుతో ఆలయాలకు ప్రతియేటా రూ.లక్షలలో గండి పడుతున్నట్టు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పాతబస్టాండు సమీపంలో ఉన్న నల్లగంగమ్మ ఆలయ అంగడి రూములకు అద్దె వేలం పాటలు నిర్వహించి నెలకు రూ.21,500 చొప్పున పాడుకుని రూ.1.29 లక్షలు చెల్లించిన వ్యక్తికి కాకుండా ఇతరులకు కారుచౌకకు రూములు కట్టబెట్టడం ద్వారా నష్టం వాటిల్లింది. బెంగళూరు రోడ్డులో సర్వేనెంబర్ 326, 329లో ఉన్న ఇదే ఆలయమాన్యం 9 ఎకరాలలో 30కి పైగా ఇటుక బట్టీ లు, నర్సరీ, ఇతర దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా వస్తు న్న ఆదాయం నామమాత్రంగా చూపి, అనధికారికంగా పె ద్ద మొత్తంలో స్వాహా చేస్తున్నట్లు సైతం ఉన్నతాధికారుల కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈవో వ్యవహారశైలితో ఆలయ ఆ దాయానికి గండి పడుతోందని పలువురు వాపోతున్నారు.

సిబ్బంది కొరతతో సమస్యలు..

ప్రస్తుతం బి.కొత్తకోట ఈవోగా చేస్తున్న మునిరాజు చిత్తూరు జిల్లా మొగిలిలో రెగ్యులర్ ఈవోగా పని చేస్తూ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. గతంలో మంజులను రెగ్యులర్ ఈవోగా వేస్తే ఆమె ఆరోగ్య కారణాలు చూపి జాయిన్ కాలేదు. బి.కొత్తకోట మాన్యం భూములు, ఆలయ ఆదాయాలపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం.

- విశ్వనాథ్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

కౌలు చెల్లించినా భూమి చూపలేదు...

పట్టణ శివారులోని మాన్యం భూములను 2023-26 వరకు లీజుకు వేలంపాటలు నిర్వహించారు. 11 మంది రైతులు రూ.2,11,500 చెల్లించి రసీదులు పొందారు. అయితే ఆయా భూములకు హద్దులు గుర్తించి భూమిని తమకు స్వాధీనం చేయమని ఆ రైతులు 15 నెలలుగా మొరపెట్టుకొంటున్నా ఫలితం లేదు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వారు వాపోతున్నారు.

ఈవో మునిరాజుపై లోకాయుక్తకు ఫిర్యాదు

బి.కొత్తకోట ఆలయాల పర్యవేక్షణ చేస్తున్న ఈవో మునిరాజు లీలలపై రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లడంతో ఈవో పనితీరు, ఆలయ మాన్యం భూముల రక్షణపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు ఆదేశాలు అందాయి. దీంతో ఈవో మునిరాజుకు కమిషనర్ నుంచి నోటీసులు అందినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దుతారో లేదో చూడాల్సి ఉంది.

కేజీబీవీలో నలుగురు సస్పెన్షన్


● విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం ఫలితం




కురబలకోట, జూలై 20: మండలంలోని ముదివేడు క్రాస్ సమీపంలోని కేజీబీవీకి చెందిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు క్రాస్ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా మదనపల్లె, సీటీఎం, ములకలచెరువుకు చెందిన ముగ్గురు విద్యార్థినులు 9వ తరగతి చదువుతున్నారు. మూడు రోజుల క్రితం వారు ప్యారసిటమాల్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై ఆర్డీవో హరినారాయణ, డీఈవో శివప్రకాష్ రెడ్డి, డీవైఈవో పురుషోత్తం, ఎంఈవో ద్వారకనాథ్, జీసీడీవో రాధమ్మ తదితరులు ఆసుపత్రి, పాఠశాలకు వెళ్లి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. దీంతో బాధ్యులైన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌వో పర్వీన్‌భాను, అకౌంటెంట్ రత్నప్రియ, నర్సు భానుప్రియ, హిందీ పండిట్ మస్తానీలను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భూ కబ్జాలు కట్టడయ్యేనా...?

కోట్లు విలువైన భూముల ఆక్రమణలు ● ఆక్రమిద్దాం... అమ్మేద్దాం... ● పేదలకు పట్టాలు ఇప్పించి కాజేసే యత్నం
పట్టించుకోని రెవెన్యూ అధికారులు ● ఖాళీస్థలం కన్పిస్తే కబ్జాలు ● మళ్లీ మొదలైన కబ్జాల పర్వం



సి.కొత్తపల్లె పొలంలో ప్రభుత్వభూమి లేఔట్



సి.కొత్తపల్లె పొలంలో కబ్జాచేసి, కంచెవేసిన ప్రభుత్వభూమి

బద్వేలుటౌన్, జూలై 20: బద్వేలు పేరు చెబితే కాలజ్ఞానతత్వవేత్త వీరబ్రహ్మేంద్రస్వాముల వారు గుర్తుకువచ్చేవారు. ప్రస్తుతం బద్వేలు అంటే ఠక్కున గుర్తుచ్చేది భూకబ్జాల అడ్డాగా పేరుగాంచింది. ఇక్కడ సెంటు భూమి కన్పిస్తేచాలు ఆక్రమిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కబ్జా దారులు రాత్రికి రాత్రే భూమిని ఆక్రమించి సొమ్ముచేసుకుంటారని జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆక్రమిద్దాం, అమ్మేద్దాం. అన్నట్లు కొందరు, కబ్జాచేస్తే మనలను ఎవరు ఆపేదంటూ మరికొందరు కబ్జాల మీద కబ్జా చేస్తున్నా, రెవెన్యూ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మళ్లీ మొదలైన కబ్జాల పర్వం

చెరువైనా... కుంటైనా...గుట్టైనా... కొండైనా అది సర్కారు భూమి అయితే చాలు వారి కళ్లపడితే కబ్జాకావాల్సిందే. రెవెవిన్యూ అధికారులు మాత్రం, కోట్లరూపాయల ప్రభుత్వభూములు కబ్జా అవుతున్నా నామమాత్రంగా పరిశీలించి బోర్డులు నాటినా, అధికారులు నాటిన బోర్డులు తొలగించడం కంచెవేస్తున్నా రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పడ్డాక ఇక్కడ స్థలాలకు మరింత విలువపెరిగింది. దీంతో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. గోపవరం తహసీల్దార్ కార్యా లయం పక్కనే కొండగుట్టపై 1623, 1624 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసినా అధికారులు పట్టించుకోలేదు. బద్వేలు మండలం సి.కొత్తపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 57/2,3,4లో 3.14ఎకరాలు, సర్వేనెంబర్ 51/1, 2, 3, 4, 5లో 3.78 ఎకరాలు, అబుసాహెబ్ పేట సమీపంలోని 6/1లో 1.20ఎకరాలు, 5.సర్వే నెంబర్ 957, సిద్దమ్మపేరంటాల ప్రాంతంలో కొందరు భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. సి.కొత్తపల్లె పొలం సమీపంలో కాల్వకు ఆనుకుని మరి కొందరు గుడిసెలువేసి భూములను కబ్జాచేస్తున్నారు. పోరుమామిళ్ల, బద్వేలు బైపాస్‌రోడ్డులో కొందరు కబ్జాలుచేసి లక్షల రూపాయలు చేతులు మారుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదు. ముందు నిరుపేద లను పెట్టి, వెనుక కబ్జాదారులు ఉంచి, గుడిసెలు వేయించి, పేదలకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామని ఆశలు చూపించి వారి నుంచి వేలకు వేలరూపాయలు వసూలు చేసేవారు కొందరు. కొండలు, గుట్టలు, చెరువుల్లో గుడిసెలు వేస్తున్నా, ప్రభుత్వ స్థలాలు పేదలకు రావని తెలిసీ, కబ్జాదారుల మాటలు నమ్మి, వారి వెనుక నడుస్తూ, డబ్బు ఖర్చుచేసుకుంటూ సమయం వృధాచేసుకునే పేదలనే కబ్జాదారులుగా చూపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులుకానీ, సిబ్బందికానీ పట్టించుకోకపోవడం దయనీయం. బద్వేలులో కబ్జాదారులు సరికొత్త ఎత్తుగడతో ప్రభుత్వ భూములను కాజేయడానికి పన్నాగంపన్ని, ముందుగా పేదల పేరిట పట్టాలు ఇప్పించి, ఆపై వాటిని స్వాధీనం పరుచుకుంటూ పేదలను తప్పుదోవ పట్టిస్తూ, కబ్జాదారులు కుతంత్రం పన్నుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



బద్వేలు మండల పరిధి సి.కొత్తపల్లె పొలంలో కబ్జాలకు పాల్పడితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అర్హులైన పేదలకు అన్యాయం జరగనీయం, ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు చర్యలు చేపడతాం. ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినా బోర్డులు తీసేసి కబ్జాలకు గురిచేసే ఎంతటివారిపైనైనా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగిస్తే చట్టపర చర్యలు తీసుకుంటాం.

మధుసూదన్‌రావు, తహసీల్దారు, బద్వేలు





గోపవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద కబ్జాదారులు వేసిన గుడిసెలు - సి.కొత్తపల్లె ప్రభుత్వ పొలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు - బోర్డు తీసేసి కంచెనాటిన కబ్జా దారులు

శ్రావణ మాసోత్సవాలు విజయవంతం చేద్దాం



ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశ దృశ్యం

చక్రాయపేట, జూలై 20: అన్ని శాఖల అధికారుల సహకారంతో గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శ్రావణ మాసోత్సవాలను విజయవంతం చేద్దామని గండి దేవస్థాన సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. శనివారం శ్రావణమాసోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసోత్సవాలకు అన్ని శాఖల సహకారం కావాలని కోరారు. రెవెన్యూశాఖ సహకారం, రోడ్డు భవనాలు, రవాణా, విద్యుత్, ఆరోగ్య, పోలీసు, పంచాయతీ, ఎక్సైజ్, సమాచారశాఖ, బ్యాంకు వారు చేయాల్సిన పనులను వివరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పందిళ్లు, క్యూలైన్లు, ట్యాంకర్లు ఏర్పాటు, సింటెక్స్ ట్యాంకులు, విద్యుద్దీపాలంకరణ, కటౌట్లులాంటివి ఉంటాయన్నారు. గండిలో నూతన ఆలయ నిర్మాణం జరుగుతున్నందున, గుడి ముందు రాజగోపురం పునాదులు వేసి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, రోడ్డు వెడల్పు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బ్యాంకు అధికారులు టికెట్లు, లడ్డు కౌంటర్లలో ఉండి కలెక్షన్ చేయాలన్నారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప అర్చకులు రాజారమేష్ డాక్టర్ వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సాలన్న, ఆర్టీసీ డీఎం ఆర్‌ఎంఎస్‌రెడ్డి, గురుమోహన్‌రెడ్డి, ఎస్‌ఐ రంగారావు, ప్రవీణ్ కుమార్ యాదవ్, కొండారెడ్డి, శ్రీనివాసులు, ఆలయ మాజీ చైర్మన్లు వెంకటస్వామి, భాస్కరుడు, పీపీ రాయుడు పాల్గొన్నారు.

అన్నమయ్య డ్యాం, ఒంటిమిట్ట చెరువుకు నీరివ్వాలి



భారీ నీటిపారుదలశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన టీడీపీ నేతలు

ఒంటిమిట్ట, జూలై 20: అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, ఒంటిమిట్ట చెరువుకు పైపు లైను ద్వారా నీళ్లు అందించాలంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ శనివారం భారీ నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం తెగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరగా అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు సుమారు రూ.38 కోట్లతో పైపులైను వేసి ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించకుండా ఒంటిమిట్ట చెరువు ఎండిపోయేలా చేసిందన్నారు. స్థానికుల కష్టాలు తొలగిపోవాలంటే ఒంటిమిట్ట చెరువుకు నీరందించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు కట్టా నారాయణ, తుమ్మలకుంట్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది.. గుర్తించండి

పనితీరు మార్చుకోక పోతే చర్యలు తప్పవు : ఎమ్మెల్యే




ప్రభుత్వ ఆస్పత్రిలో వైసీపీ పోస్టర్ పెయింట్

మైదుకూరు రూరల్ జూలై 20: వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ విషయాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. గోడలపై వైసీపీ నేతల బొమ్మల పెయింటింగ్‌లను చూశారు. ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం ఉందనే భ్రమలోనే ఉన్నట్లు ఉన్నారంటూ వారికి చురకలేశారు. రోగులకు వైద్యం సరిగా అందించక పోయిన, సమయానికి ఆఫీసుకు రాకపోయినా, ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు,

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

ప్రతి కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలి

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

పులివెందుల రూరల్, జూలై 20: లైంగిక వేధింపుల ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక మినీ సెక్రటేరియట్‌లోని ఆర్డీఓ కార్యాలయ సమావేశం హాల్‌లో పోష్ యాక్ట్-2013 చట్టంపై డివిజన్ పరిధిలోని మండలస్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ పోష్ యాక్ట్-2013ను పటిష్టంగా అమలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. వేధింపులకు గురైన మహిళలు మున్సిపల్‌స్థాయిలో మున్సిపల్ కమిషనర్, మండలస్థాయిలో తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నేరుగా ఫిర్యాదు చేయలేని వారి కోసం ప్రతి కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమష్టిగా ముందుకెళ్లి మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేద్దామని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎస్‌ఐ సునీల్‌కుమార్, ఎంపీడీఓ దివాకర్, సీడీపీఓలు శ్రీలత, సునీత, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, వ్యవసాయ శాఖ, పీఆర్, ఐసీడీఎస్ పీడీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో ఇద్దరు యువకులు ఆత్మహత్య

పుల్లంపేట, జూలై 20: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పుల్లంపేట ఎస్‌ఐ రఘురాం తెలిపారు. దళవాయిపల్లె వాసి వీరాంజనేయరెడ్డి, రామక్కపల్లెకు చెందిన జయసింహ ఆత్మహత్య చేసుకున్నారు. వీరాంజనేయరెడ్డి పదేళ్ల కిందట కువైత్‌కు వెళ్లాడని, అక్కడ అకామా లేక చాలా ఇబ్బందులు పడ్డారని, ఇంటికి కూడా డబ్బు పంపలేకపోయాడు. నెల కిందట కువైత్ ప్రభుత్వం కానూన్ పెట్టడంతో ఇండియాకు వచ్చిన వీరాంజనేయరెడ్డి స్వగ్రామంలో ఇంటికి రాకుండా తన స్నేహితుని వద్దే ఉంటూ వచ్చాడన్నారు. మనస్థాపంతో శనివారం అనంతంపల్లె సమీప కోటగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఉండడంతో స్థానికులు గమనించి ఫిర్యాదు చేశారన్నారు. జయసింహ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడి

ఐదుగురిపై కేసు నమోదు - ఇందులో ఎంఈఓ ఒకరు

కడప (క్రైం), జూలై 20: కడప నగరం డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును పాత ఆర్‌జేడీ అనుచర ఉపాధ్యాయులు దాడి చేసిగాయపరచినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు వేంపల్లికు చెందిన వెంకటేశ్వర్లు సుండుపల్లె మండలం జి.కె రాజుపల్లెలోని జడ్పీ స్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 18న పూర్వ ఆర్‌జేడీపై విచారణ కోసం కడప డీఈఓ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో ఆర్‌జేడీ అనుచరులు ఉపాధ్యాయులు గడ్డం ఆదినారాయణరెడ్డి సహా సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్‌నాయక్, మరో ఇద్దరు ఉపాధ్యాయులు నాగమునిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణ బాధితుడి సెల్‌ఫోన్‌ను పగులగొట్టి దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఆర్‌జేడీపై విచారణకు ఆటంకం కలిగించడం కోసం దాడి జరిగినట్లు బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - ఒకరి అరెస్ట్

వీరబల్లి, జూలై20: అన్నమయ్య జిల్లా సానిపాయి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్‌ఐ (ఆపరేషన్స్) సురేశ్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ లింగాధర్ టీం అటవీ సిబ్బందితో కలిసి సానిపాయి బేస్ క్యాంప్ నుంచి రాయవరం మీదుగా ఆవులదారి, సరస్వతి కటువ, ముడుంపాడు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తూ వెళ్లారు. లమోర నిషేధిత అటవీ ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలతో కనిపించారు. వారిని చుట్టు ముట్టగా వారు దుంగలను పడేసి పారిపోసాగారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒకరిని పట్టుకున్నారు. ఇతడు తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయతీ వాసి రమేశ్‌గా గుర్తించి అరెస్టు చేసి ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

పశువుల సంతను ప్రారంభించిన ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్ జూలై 20: స్థానిక నంద్యాల రోడ్డులో పశువుల సంతను శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. గత ప్రభుత్వంలో కొందరి స్వలాభం కోసం మైదుకూరులోని పశువుల సంతను గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేయడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన పుట్టా సంతను మైదుకూరులోనే ఏర్పాటు చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆమేరకు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో సభ్యుల ఆమోదంతో మైదుకూరులోకే సంతను మార్చి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, లక్ష్మీనారాయణ, రాధ, రాయుడు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రాజంపేట, జూలై 20: రాజంపేట మండల పరిధి పోలి గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ సుబ్బయ్య(26) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోలి ఎస్టీకాలనీ వాసి సుబ్బయ్య అదే గ్రామంలోని పెంచలయ్య ట్రాక్టర్ యజ మాని వద్ద ఇంటి పునాదిరాళ్లను గుట్టపై నుంచి తోలడం జవనోపాధిగా జీవించేవాడు. అదే క్రమంలో రాళ్లను తీసుకు వస్తూ ట్రాక్టర్ సమస్యపై కింద ఉండి పనిచే స్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి సుబ్బయ్య శరీరం పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, జూలై 20: ఏకశిలా నగరి కోదండరాముని స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున సుగంధద్రవ్యాలు, పట్టువస్త్రాలతో ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సీతారామ లక్ష్మణ మూలవిరాట్టులకు గంధం, చందనం, పాలు, పెరుగుతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్థలం కోసం ఇరువర్గాలు ఘర్షణ

ఒంటిమిట్ట, జూలై 20: కోదండరామాలయ కాలనీలో ఖాళీ స్థలం కోసం రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొద్దిరోజుల కిందట ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నించడం, అప్పటి నుంచి ఇరువర్గాల నడుమ వివాదం కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం ఓ హోటల్ వద్ద ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుని దాడి చేసుకున్నారు. పోలీసులు రెంటాల రాజేష్, విశ్వనాథ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కడప క్రైమ్, జూలై 20: కడప నగరం జ్యోతి కెమికల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంహెచ్ లక్ష్మీ (28) మృతి చెందినట్లు రిమ్స్ సీఐ రామచంద్ర తెలిపారు. అక్కాయపల్లెలోకి తోటపల్లె రోడ్డుకు చెందిన డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో ఆమె బ్యూటీషియన్ కోర్సు చేస్తోంది. శనివారం భర్త నవీన్‌తో కలసి ద్విచక్ర వాహనంలో డీఆర్‌డీఏకి వెళుతుండగా గ్యాస్ సిలిండర్‌ల లారీ బైక్‌ను ఢీకొనడంతో భార్య భర్తలు కింద పడ్డారు. భార్య వెనక టైర్ కింద పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకం నిలిపేయాలి : కమిషనర్



మున్సిపల్ అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న 300 కిలోల ప్లాస్టిక్ కవర్లు

రాయచోటిటౌన్, జూలై20: దుకాణ యజమానులు, తోపుడు బండ్ల వారు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. శనివారం ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు చేసి అక్రమంగా వినియోగిస్తున్న 300 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యంలో భాగంగా 2022లోనే కేంద్ర ప్రభుత్వం 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. గతంలోనే పలుమార్లు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించినా మార్పు రావడం లేదన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం వందశాతం ఆగే వరకూ రోజూ తనిఖీ చేస్తామని, దుకాణదారులు అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే 120 మైక్రాన్ కన్నా తక్కువ పరిమాణం గల ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మడం, కొనడం వాడకం పూర్తిగా నిషేధమన్నారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని పిలుపు నిచ్చారు. సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పోలీసు సిబ్బంది, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఎస్‌ఐ



కడప (క్రైం), జూలై 20: కడప నగరం రాజీవ్ మార్గ్ వద్ద స్కూటర్‌పై వస్తున్న ఇంటర్ విద్యార్థి వాహనం ఆపి ఎస్‌ఐ మధుసూద నరెడ్డి చితక బాదినట్లు విద్యార్థి తండ్రి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గుర్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమా రుడు స్కూటర్‌పై వెళితే ఎస్‌ఐ ఆపి జరిమానా గానీ, లేకుంటే తమకైనా ఫిర్యాదు చేసి చెప్పాలేగానీ ఇలా పిల్లలపై దాడి చేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఎస్‌ఐ తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్‌ఐ చేతిలో గాయపడిన విద్యార్థి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మధు సూదనరెడ్డిని వివరణ కోరగా తనిఖీలో భాగంగా వాహనంలో వేగంగా వెళ్లడాన్ని గమనించి అడ్డుకునేందుకు తన చేతిని అడ్డంపెట్టగా వేగంగా పోతున్న బైక్ తగలడంతో చేయి విరిగిందన్నారు. దీంతో అతన్ని పట్టుకుని, వాహనాన్ని తీసుకుని మందలించినట్లు తెలిపారు.

ప్రహరీ విషయంపై ఘర్షణ - మహిళలకు గాయాలు



దాడిలో గాయపడిన నక్కా లక్ష్మీదేవి, లక్ష్మీదేవమ్మ

రామాపురం, జూలై20: ఓ ఇంటి ప్రహరీ విషయమై జరుగుతున్న ఘర్షణను చూసేందుకు వచ్చిన ఇద్దరు మహిళలపై దాడి జరిగి గాయపడినట్లు ఎస్‌ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే....

హసనాపురం పంచాయతీ కొండాండ్లపల్లె వాసులు సిగ రాజారావు, జరుగు చలమారెడ్డి ఇంటి ప్రహరీ విషయంపై శనివారం ఘర్షణ పడుతున్నారు. రామాపురం మండలం హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లి వాసులు సిగా రాజారావు, జరుగు చలమారెడ్డి కొద్ది కాలంగా ఇంటి ప్రహరీ విషయంపై ఘర్షణ పడుతూ ఉండేవారు. శనివారం జిల్లా సర్వేయర్‌ను గ్రామంలోకి పిలిపించి ఇంటి ప్రహరీ సర్వే చేస్తుండగా వారి ఇద్దరూ ఘర్షణ పడుతుండగా చూడడానికి వచ్చిన నక్క లక్ష్మీదేవి, నాగిరెడ్డి, లక్ష్మీదేవమ్మపై జరుగు చలమారెడ్డి మరికొందరు వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నక్క లక్ష్మీదేవి ముఖంపై రక్తగాయాలు నాగిరెడ్డి లక్ష్మీదేవమ్మకు రెండు చేతులు విరిగి రక్త గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి రామాపురం ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది చేరుకుని గాయపడిన మహిళలను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 20: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను మెరుగు పరచాలని మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్ తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు వర్షాకాలంలో పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు దర్గాలో గురుపౌర్ణమి ఉత్సవం

రామాపురం, జూలై 20: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ శ్రీసాయి నగర్‌లో సమర్థ సద్గురు దర్గా స్వామిజీ దర్గా మాతాజీ ఆశ్రమంలో ఆదివారం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం దర్గా స్వామిజీ, దర్గా మాతాజీ మందిరంలో ప్రార్థనలు, కాకడ హారతి, శ్రీ సద్గురు దర్బారు సాయినాథ్ మహరాజ్‌కు పంచామృతాభిషేకం, రాత్రి పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి భక్తాదులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉచిత ఆటో సర్వీసు ప్రారంభం

నందలూరు, జూలై 20 : సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మండల జనసేన నాయకులు కొట్టే శ్రీహరి జనసేన ఎన్‌ఆర్‌ఐ, స్థానిక జనసైనికుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం, ఉచిత ఆటో సర్వీసులను రాజంపేట నియోజకవర్గ జనసేన నేత అతికారి దినేష్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట కేధార్‌నాథ్, జనసేన నాయకులు గుగ్గిళ్ల నాగార్జున, ఉల్లి ఉపేంద్ర, కొట్టే హరీష్, మంకు వెంకటేశ్, నరసింహ చెర్రి, మస్తాన్ రాయల్, కొట్టే హరి బ్రదర్స్, డాల వినయ్, అరుణ, మల్లీ, జనసైనికులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలు

సుండుపల్లె, జూలై20: దండుమారెమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ పగలగొట్టి నగదు అపహరించినట్లు భాగంపల్లి పంచాయతీల ప్రజలు తెలిపారు. సుమారు రూ.6 వేల వరకు నగదును తీసుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అడవిపల్లి ఆవుల దేవర (శివాలయం) ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఊరికి చివర ఉండే ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి తాళాలు పగలగొట్టి నగదును అపహరించినట్లు పేర్కొన్నారు. ఆలయ హుండీలో సుమారు రూ.20 వేలు నగదు ఉంటుందని స్థానికులు తెలిపారు.

కౌన్సిలర్ మృతికి సంతాపం

రాయచోటిటౌన్, జూలై 20: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు కౌన్సిలర్ మయాన ఆసిఫ్ అలీఖాన్ మృతికి మున్సిపల్ పాలకవర్గం శనివారం సంతాపం వ్యక్తం చేసింది. మున్సిపాలిటీ సభా భవనంలో ఆసిఫ్‌అలీఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మయాన జకియాఖానమ్ హాజరయ్యారు. మున్సిపాలిటీతో పాటు, భద్రకాళీ సమేత వీరభద్రాలయం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



'రాష్ట్రాన్ని నేరాంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్‌రెడ్డి'


రాయచోటి: మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా


రైల్వేకోడూరు: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాయచోటిటౌన్, జూలై 20: వైసీపీని 151 స్థానాల నుంచి 11 స్థానాలకు దించినా జగన్‌రెడ్డి వంకర బుద్ధి పోలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా దుయ్యబట్టారు. శనివారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే రాష్ట్రపతి పరిపాలన కావాలని కోరుతున్నాడని, గత ఐదేళ్లలో జరిగిన హత్యలు, అక్రమ కేసులకు జగన్‌రెడ్డిని దేశం నుంచే బహిష్కరించాలన్నారు. వినుకొండలో జరిగిన హత్యపై జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. ఆయన పెంచి పోషించిన గంజాయి బ్యాచులు ఇప్పుడు కూడా అల్లర్లు, హత్యలు చేస్తున్నాయన్నారు. ఇప్పుడు ఆయన మాటలు ఊస్తే దెయ్యాలు వేదాదు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఇకనైనా జగన్‌రెడ్డి బుద్ధి తెచ్చుకుని ప్రజల్లో అభాసుపాలు కాకుండా ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి పార్థసారథిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, బసిరెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి జగన్‌రెడ్డి ఇంకా తేరుకున్నట్లు లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు ఎద్దేవా చేశారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో గంజాయిని విచ్చలవిడిగా ఉపయోగించే ఇద్దరు కొట్టుకోగా, ఒకరు చనిపోగా, ప్రభుత్వం వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసిందన్నారు. ఇది ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తానని జగన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో సొంత పార్టీ ఎమ్మెల్సీ ఒక దళితుడిని హత్యచేసి డోర్ డెలివరీచేసినపుడు రాష్ట్ర పరిస్థితులు అర్థం కాలేదా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు ఆది నారాయణ, రమణ, టి.హరిప్రసాద్, డాక్టర్ రేణుప్రసాద్‌రాజు, పి.సూర్యచంద్ర, వేణుగోపాలాచారి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పూలేల రమేష్ మాట్లాడుతూ అంతిమ యాత్రలో రాజకీయాలు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మైనారిటీ అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకున్నప్పుడు స్పందించని వైసీపీ నాయకులు ఇప్పుడు రాష్ట్రంలో చంద్రబాబు పాలను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. హత్య రాజకీయాలపై జగన్‌రెడ్డి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మారణ హోమం గురించి వైసీపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు తేనెపల్లి చిన్నా టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండాలి


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఎస్.రమణ

రైల్వేకోడూరు(రూరల్), జూలై 20: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ జిల్లా అధికారి ఎస్.రమణ తెలిపారు. శనివారం మండలంలోని వి.వి.కండ్రిగ, గుండాలపల్లె 33/11 కె.వి సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. అనంతరం రాఘవరాజుపురం పంచాయతీలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎత్తయిన లోడుతో వాహనాలు వెళ్లే మార్గాలు గుర్తించి విద్యుత్ లైన్ల ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి, కోడూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యోగానందం, చలపతి, కిరణ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిన్నశేష, సింహ వాహనాలపై సిద్ధేశ్వర, చెన్నకేశవులు


చిన్న శేష వాహనంపై సిద్ధేశ్వరస్వామి

రాజంపేట, జూలై 20: తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవుల స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా. శనివారం ఉదయం సిద్ధేశ్వరస్వామికి, చెన్నకేశవస్వామి వారికి పల్లకిసేవ నిర్వహించారు. సాయంత్రం సిద్ధేశ్వర స్వామి చిన్నశేష వాహనం పైన, చెన్నకేశవస్వామి సింహ వాహనంపైన మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెనగలూరు, రాజంపేటకు చెందిన జ్యోతి, రెడ్డిలక్ష్మీ, సుభాషిణి బృందాలు కోలాటం ప్రదర్శించారు. రాజంపేట డివిజనల్ అధికారి మోహన్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వార్లను దర్శించుకున్నారు. తాళ్లపాక సమూహ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామియాదవ్, వినోద్‌కుమార్, టీటీడీ విజిలెన్స్ నిఘా విభాగ ఇన్‌చార్జి గంగులయ్య, సర్పంచ్ శ్యామనబోయిన గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ఆర్. స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు

రాయచోటిటౌన్, జూలై20: అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను శనివారం టీడీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కలిసి మొక్కను అందజేసి సన్మానించారు. అనంతరం జిల్లాలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అన్ని నియోజకవర్గాల్లో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరబల్లి టీడీపీ మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, టీడీపీ నాయకులు భాస్కర్ రాజు, శ్రీనివాసరాజు, ఆంజనేయులు, నాగప్పనాయుడు, వీరామృత నాయుడు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్వేలి, జూలై 20 : మండల పరిధిలోని చిట్వేలి పత్తిగుంటవారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి సాయంత్రం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట చలపతి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదివారం పత్తిగుంటవారిపల్లె 33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంగిమళ్లలో పెద్దపీర్ల ఊరేగింపు

వీరబల్లి, జూలై 20: మొహరం సందర్భంగా వంగిమళ్ల పెద్దూరు కస్పాలోని చావిడిలో మూడు పీర్లను కొలువు తీర్చారు. ప్రతి ఏటా మొహరం ముగింపు అనంతరం మూడవ రోజు హుస్సేన్, ఇమామ్ ఖాసీం, హజరత్ అలీ అనే పీర్లను పీర్ల చావిడిలో కొలువు తీరుస్తారు. మొక్కుబడులు ఉన్న భక్తులు బాసికాలను సమర్పించారు. . అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించారు.

చేనేత క్లస్టర్ భూముల పరిశీలన


కార్మికులతో మాట్లాడుతున్న జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి నాగరాజరావు

సిద్దవటం, జూలై 20 : మండలంలోని మాధవరం ఎస్‌కెఆర్ నగర్ సమీపంలోని చేనేత క్లస్టర్‌కు సంబంధించిన భూములను శనివారం జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి నాగరాజ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ రెండు ఎకరాల 80 సెంట్ల చేనేత క్లస్టర్ భూమలకు హద్దులు ఏర్పరుచుకుని ఆన్‌లైన్ చేయించుకోవాలని చేనేత కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అనూరాధ, వీఆర్వో గౌస్‌పీర్, రజని, పంచాయతీ సర్పంచ్ జానకిరామయ్య, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వేతనం ఇప్పించాలని వలంటీర్ల వినతి


ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ వలంటీర్లు

పెనగలూరు, జూలై 20 : తమకు గౌరవ వేతనాలు ఇప్పించాలని పెనగలూరు-2 సచివాలయ వలంటీర్లు శనివారం పెనగలూరు ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రెండు నెలలుగా తమకు గౌరవ వేతనం ఇవ్వడంలేదని, బకాయిలు కూడా ఇవ్వలేదని ఈ సందర్భంగా తెలిపారు. గౌరవ వేతనాల కోసం ప్రభుత్వానికి బిల్లులు పెట్టాలని పెనగలూరు డీడీవోను కోరగా ఆయన ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవని అంటున్నారని తెలిపారు. పేపరు బిల్లులు మాత్రమే ఆపాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిం దని తమ గౌరవ వేతనాలు నిలిపివేయాలని జీవోలో ఎక్కడా పేర్కొన లేదని వలంటీర్లు జీవోను చూపించారు. ఈ విషయంపై ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ జీవోను పరిశీలించిన తర్వాత ఉన్నతాధికారులతో సంప్రదిస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలి

రామాపురం, జూలై 20: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపించాలని లక్కిరెడ్డిపల్లె ఏడీఏ జయరాణి తెలిపారు. మండలంలోని రాచపల్లి, నల్లగుట్టపల్లెల్లో శనివారం కడప కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపాలన్నారు. ఏడీఏ జయరాణి మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగంతో ఖర్చు పెరగడంతో పాటు వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండ్లు, కూరగాయలు, పసుపు, పూలతోటలు, ద్రవ జీవామృతం టైప్ వన్, టైప్ టు జీవామృతం, పంచగవ్య కోడిగుడ్ల ద్రావణం తదితరాలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాపురం వ్యవసాయ అధికారి నాగమణి, డీఆర్‌సీ వ్యవసాయాధికారి సుచిత్ర, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆదర్శరైతులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని ఐదు ఆవుల మృతి

ఒంటిమిట్ట, జూలై20: పొలంలో చల్లిన విషగుళికలు తిని శనివారం ఐదు ఆవులు మృతి చెందాయి. చింతరాజుపల్లెకు చెందిన మనోహర్ నాయుడు పొలంలో చొరబడిన రామచంద్రయ్యకు చెందిన ఆవులు, పొలంలోని మేతను తినడంతో మృతి చెందాయి, బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విషజ్వరాల బారి నుంచి కాపాడండి

● మున్సిపల్ కమిషనర్‌కు న్యాయవాదుల సంఘం ఫిర్యాదు


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భారత న్యాయవాదుల సంఘం నేతలు

రాయచోటిటౌన్, జూలై 20: దోమల ఉత్పత్తి చేసే కేంద్రంగా మారిపోయిన మాండవ్య నదిని శుభ్రం చేయడంతో పాటు, పట్టణంలోని మురుగునీరు నదిలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు రాయచోటి మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రాజకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఐఏఎల్ న్యాయవాదులు రెడ్డెయ్య, హుమయూన్‌బాషా, చిన్నయ్య, అక్బర్‌అలీ తదితరులు మాట్లాడుతూ నదిలోకి చేరుతున్న మురుగును చెన్నముక్కపల్లె సమీపంలో నదికి ఇరువైపులా ఉన్న కాలువల ద్వారా వెళ్లిపోయేట్లు చేయాలన్నారు నదికి ఇరువైపులా ఉన్న కాలువలు పూడికతో నిండిపోవడంతో మాండవ్యనది మురుగునీటి చెరువులా తయారైందని, కాలువల్లో తక్షణం పూడిక తీయించి మురుగు నీటిని పట్టణానికి దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, మురుగునీటిని శుభ్రపరిచి నదిలోనికి వదిలేసే ప్రాజెక్టులను తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని కమిషనర్ న్యాయవాదులకు తెలియజేశారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 20: కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని జేడీఏ చంద్రా నాయక్ తెలిపారు శనివారం కోనంపేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ విస్తరణ అధికారుల సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. సబ్సిడీ విత్తనకాయలు, ఎరువులు రైతులకు కచ్చితంగా అందించాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి పంటలకు సంబందించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. విత్తన శుద్ధి విధానం, పంటల మార్పిడి, ప్రకృతి ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు విధానం, ఇతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, ఎరువులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబురావు, ఏఈఓలు చాన్‌బాషా, అనూష వ్యవసాయ విస్తరణ అధికారులు సాయి, సుధా, లావణ్య, హరిత, పవన్, నాగరాజు, రమేష్, పరిమళ పాల్గొన్నారు

యూనిఫాం దుస్తులతో విద్యార్థుల్లో సమానత్వం


విద్యార్థులకు యూనిఫాం దుస్తులు అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సంబేపల్లె, జూలై 20: ప్రభుత్వ పాఠశాలలో సమరూప దుస్తులు విద్యార్థుల్లో సమానత్వ భావనను కలిగిస్తాయని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. శనివారం బొగ్గువారి పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లమల రామాంజులతో కలసి యూనిఫాం దుస్తులను అందించారు. ప్రభుత్వం అందజేసే పుస్తకాలు, బ్యాగులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యంతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపాల్‌నాయక్, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

గాలివీడు, జూలై 20: రాష్ట్ర రవా ణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవ తో గాలివీడు మండలం ఎగువగొట్టి వీడు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. కొన్నేళ్లుగా ఎగువ గొట్టివీడు కస్పాలోని ప్రజలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థు లు తాగునీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఈ సమస్యను గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొని రాగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి గతంలో వేసిన బోరు నుంచి కొత్త పైపులైన్ కనెక్షన్ ఇప్పించి శనివారం గ్రామానికి నీటి సరఫరా చేశారు. దీంతో గ్రామ ప్రజలు పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం


ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

రాజంపేట టౌన్, జూలై 20: రాజంపేట మున్సిపల్ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది రాజంపేట పట్టణంలోని దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇతర వస్తువులను శనివారం స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించినా వాడుకలో ఉండడం గమనించిన అధికారులు పలు దుకాణాల్లో వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో ఎవరూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయించరాదని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ము న్సిపల్ కమిషనర్ రాంబాబు స్వయంగా పాల్గొన్నారు.. ఇకనుంచి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసు లు విక్రయించినా, వాడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

విద్యార్థి సంఘాల వేధింపులపై ఫిర్యాదు


బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం

రాజంపేట టౌన్, జూలై 20: విద్యార్థి సంఘాల పేరుతో పలువురు వేధిస్తున్నారంటూ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యంకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు వివరించారు. శనివారం రాజంపేట ఆర్ అండ్ బీ బంగ్లాలో రాజంపేట ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వారు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా తమకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ మధ్య కాలంలో విద్యార్థి సంఘాల నాయకులం అంటూ ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. నిజాయితీగా తన బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులపై నిందలు వేస్తూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను మానసిక క్షోభకు గురి చేస్తున్నార న్నారు. శ్రీ చైతన్య మూడో బ్రాంచ్ పెట్టాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సుమారు 25 చిన్న బడ్జెట్ స్కూళ్లను కాపాడాలని బాలసుబ్రమణ్యంను కోరారు. త్వరలో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

రామాపురం, జూలై 20: మండలంలో ఆధార్‌కార్డు వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27 వరకు అప్‌డేట్ క్యాంపును నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 23న కుమ్మరపల్లి, వెంకటరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు, 24 కసిరెడ్డిగారిపల్లె, కొత్తపల్లె, భయ్యారెడ్డిగారిపల్లె, సూర్యనారాయణపురం, 25న చిట్లూరు, సరస్వతిపల్లె, కల్పనాయునిచెరువు, 26న పప్పిరెడ్డిగారిపల్లె, నీలకంఠ్రావుపేట, 27న రాచపల్లి, గోపగుడిపల్లెల్లో సరస్వతిపల్లె, గువ్వలచెరువుల్లో స్పెషల్ మొబైల్ క్యాంపులు ఉంటాయన్నారు.

అమరవీరులకు శ్రద్ధాంజలి

రాయచోటిటౌన్, జూలై 20: ఈ నెల 16న జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించిన వీర జవాన్లకు శనివారం రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ పెద్దలు మాట్లాడుతూ భారతదేశ రక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిదని, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్, సెక్రటరీ శివశేఖర్, ట్రెజరర్ రాజు, కృష్ణదేవరాయలు, విశ్వజవహర్, డాక్టర్ రెడ్డెన్న, షబ్బీర్, షౌకత్, మాజీ సైనికులు నాగబసిరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు మహిళా అధ్యక్షురాలుగా పోలిశెట్టి రాజేశ్వరి

రైల్వేకోడూరు(రూరల్) జూలై, 20: కాపునాడు పట్టణ మహిళా అధ్యక్షురాలుగా పోలిశెట్టి రాజేశ్వరి, కార్యదర్శిగా కసారం అరుణను ఎన్నిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వీపీ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాలను రాష్ట్ర కార్యదర్శి కటికం సుబ్రహ్మణ్యంకు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు మహిళలకు అండగా ఉండడంతోపాటు, నియోజకవర్గంలోని కాపు మహిళలకు ఏ సమస్యలు వచ్చినా ముందుండి పరిష్కారం చేస్తామని తెలిపారు. తమను ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులకు, కార్యదర్శి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె, జూలై 20: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనసరి అని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ లక్కిరెడ్డిపల్లె మోడల్ స్కూల్ నుంచి కాశినాయన మండలం నరసాపురం మోడల్ స్కూల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. అధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీని వాసులు, శ్రీకళ, జమ్రూద్ బేగం, విజయ, విజయకుమారి, సుజాతమ్మ, భారతి, అరుణకుమారి, సుమియా, ఉమామహేశ్వరి, సోమశేఖర్‌నాయక్, సుఖేష్‌బాబు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

గాలివీడు, జూలై 20: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో పద్మావతి తెలిపారు. శనివారం నూలివీడు కస్పాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు అడ్డుకోవాలన్నారు. ప్రతి మహిళ తమ స్మార్ట్ ఫోన్లలో ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098లను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మిదేవి, సోని, అంగన్వాడీ టీచర్లు లక్ష్మిదేవి, ఇరగ్మ, కదిరున్నీసా, మోహన్ కుమారి, దిల్షాద్ పాల్గొన్నారు.

భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది

హోంమంత్రి అనిత


తిరుమల ఆలయం వెలుపల భక్తులతో మాట్లాడుతున్న అనిత

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి):శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోందని హోంమంత్రి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూల మూర్తిని దర్శించుకున్నారు.రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం అనిత ఆలయం ముందు భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారన్నారు. గతానికంటే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని, లడ్డూ, అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నట్టు తెలిపారు. ఇదే ఆనందం భక్తుల్లో నిత్యం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్డీయే కూటమిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. స్వామి ఆశీస్సులుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే నమ్మకం ఉందన్నారు.

సర్పాల సయ్యాట



గూడూరు తహసీల్దారు కార్యాలయ సమీపంలో శనివారం సాయంత్రం రెండు పాములు సయ్యాట లాడుతూ కన్పించాయి.మీసేవ కార్యాలయ ఆవరణలో గంటకు పైగా రెండు పాములు ఒకదానితో ఒకటి పెనవేసుకుని పెనుగులాడుతుండడాన్ని వెలుగు, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది గమనించారు. అయితే కార్యాలయాల ఆవరణలో ఇలా విషసర్పాల సంచారంపై వారంతా భయాందోళనకు లోనవుతున్నారు.

\- గూడూరు

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై కేసు

రేణిగుంట, జూలై 20: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణిపై కేసు నమోదయ్యింది.రిజిస్ట్రార్ కార్యాల యంలో స్టాంపుల ద్వారా వచ్చిన రూ.21.51 లక్షల సొమ్మును ప్రభుత్వ ట్రెజరీకి చెల్లించకపోవడం గుర్తించిన జిల్లా రిజిస్ట్రార్ కమలాకర్ గతంలో సబ్ రిజిస్ట్రార్ శోభారాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16న ఫిర్యాదు చేశారు.దీంతో సబ్ రిజిస్ట్రార్ శోభారాణి, సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌పై కేసు నమోదయ్యింది.

ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 20: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో గడచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గుడిపాలలో 5.8, కుప్పం 3.4, పలమనేరు 2.6, గుడుపల్లి 2.6, వి.కోట 2.2, గంగవరం, శాంతిపురం మండలాల్లో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రెండు టెంపోల ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు


ఢీకొన్న టెంపోలు - గాయపడ్డ భాస్కర్, సూర్యకాంతం

శాంతిపురం, జూలై 20: కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని కడపల్లె సమీపంలో శివపురం వద్ద శనివారం రెండు టెంపోలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రగాయపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం సమీపంలోని రంగాపురం గ్రామానికి చెందిన సూర్యకాంతం పాల టెంపోలో తిరుపతి వైపు తీసుకెళ్తున్నారు. కృష్ణగిరి చెందిన భాస్కర్, మణి మరో టెంపోలో కర్ణాటక రాష్ట్రం చింతామణికి వెళుతున్నారు. కడపల్లె సమీపంలోని శివపురం వద్ద టెంపోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. భాస్కర్, సూర్య కాంతంలకు తీవ్ర గాయాలయ్యాయి. మణికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజి ఆసుపత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉష ఉన్నత విద్యకు సహకరించాలని సీఎంకు వినతి

పుంగనూరు, జూలై 20: తన కుమార్తె ఉష ఉన్నత విద్య అభ్యసించడానికి సహకరించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు తండ్రి ఉమాశంకర్ కోరారు. పుంగనూరు చెందిన ఉమాశంకర్ శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన తన కుమార్తె ఎం.ఉష తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ 80 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైనా ఎన్ఎస్‌పీ స్కాలర్ షిప్ మంజూరుకు నిరాకరించారని, గోల్డ్ మెడల్ ప్రకటించలేదని, పీహెచ్‌డీకి అవకాశం కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ అదేశించినా యూనివర్శిటీ అధికారులు స్పందించలేదని సీఎం ఎదుట వాపోయారు. ఉష ఉన్నత విద్య అభ్యసించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని, సంబంధిత అధికారులను విచారించి న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని తెలియజేశారు.



ఆకట్టుకున్న పాండవ జననం

వెదురుకుప్పం, జూలై 20: మండలంలోని పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన పాండవ జననం ఘట్టం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాండవుల ప్రతిమలు భక్తులను ఆకర్షిం చాయి. పచ్చికాపల్లంకు చెందిన పొన్నాల మోహన్‌రెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు.

పోలీసుల అదుపులో వృద్ధురాలి హత్య కేసు నిందితుడు!

లోతుగా విచారిస్తున్న దర్యాప్తు బృందం


స్కూటర్‌పై పరారవుతున్న శ్రీనివాసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 20: తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో నిందితుడిగా గుర్తించిన శ్రీనివాసులును పోలీసులు తిరుమలలో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా తయారైన ఆ యువకుడు రెండు కుటుంబాల మధ్య నెలకొన్న మనస్పర్థలు, వృద్ధురాలు తరచూ మందలిస్తుండడంతో పగ పెంచుకున్నాడు. రెండేళ్ల కిందట కూడా జయలక్ష్మి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించినట్లు సమాచారం. ఆ తర్వాత ఇంటి ముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలతో రాయల్‌నగర్ నుంచి పెద కాపు లేఅవుట్‌కు కాపురం మార్చాలని స్నేహితులు, కొందరు కుటుంబీకులు జయలక్ష్మి కుటుంబానికి సూచించినా వారు పట్టించుకోలేదు. ఈ విషయాలు తెలియడంతో దర్యాప్తు బృందం మరింత లోతుగా విచారిస్తోంది.

విచారణలో ఆసక్తికరమైన విషయాలు

పోలీసుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనట్లు సమాచారం. నిందితుడు శ్రీనివాసులు.. జయలక్ష్మి మనవరాలిని ఈవ్‌టీజింగ్ చేసేవాడు. దీనిపై మనవరాలు తండ్రికి చెప్పింది. 'ఏమీ కాదులే నువ్వు ధైర్యంగా వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఆమె తండ్రి పలుసార్లు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని తెలిసింది. ఇది తెలిసి జయలక్ష్మి పలుసార్లు శ్రీనివాసులును మందలించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో పగ పెంచుకున్న శ్రీనివాసులు హత్యకు మూడు, నాలుగు రోజుల నుంచి వృద్ధురాలి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఒంటరిగా దొరికితే చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం జయలక్ష్మిని ఒంటరిగా వదిలి ఆమె కోడలు, పెద్ద మనవరాలు డ్రైవింగ్ నేర్చుకోవడానికి బయటకు వెళ్లారు. చిన్న మనవరాలు 15 నిమిషాల్లో స్కూల్ నుంచి వస్తోందని తెలిసి గేట్లు అన్నీ కూడా తెరచి పెట్టారు. దీన్ని అదనుగా భావించిన నిందితుడు తనింట్లో వారికి గుంటూరుకు వెళుతున్నానని చెప్పి బ్యాగు సర్దుకుని బయటకు వచ్చాడు. మెయిన్ గేటు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి ఫస్ట్ ఫ్లోర్‌లో ఎవ్వరూ లేకపోవడంతో అక్కడ బట్టలు మార్చుకున్నాడు. డూప్లెక్స్ హౌస్ కావడంతో రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడున్న జయలక్ష్మిని కత్తితో వెనుక నుంచి బలంగా పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. కింది ఫ్లోర్‌లోని బెడ్‌రూములో ఉన్న చిన్న మనవరాలు నియతి కూడా అరవడంతో ఆమెవద్దకొచ్చి గట్టిగా నెట్టాడు. ఆమె కిందపడి స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత ఇంట్లో ఉన్న వేయింగ్ మిషన్‌తో మళ్లీ రెండో ఫ్లోర్‌కి వెళ్లి వృద్ధురాలి ముక్కుపై బలంగా బాది హత్య చేశాడు. మరోవైపు స్పృహలోకి వచ్చిన నియతి రెండో అంతస్తులోకి వెళ్లగా ఆమె మెడపై నాలుగు కత్తి పోట్లు పొడిచాడు. నియతి గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో ఇంట్లోకి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ ఈ కేకలను విన్నారు. మరోవైపు నిందితుడు పరారవుతున్న క్రమంలో కిందకు దిగగా.. ఎదురుగా మెట్లపై కనిపించిన ప్రేరణను పక్కనున్న గోడకు బలంగా బాది, ఆమె వద్ద నుంచి ద్విచక్ర వాహనం తాళాలు లాక్కొని పరారైనట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

అన్నప్రసాదం, లడ్డూ నాణ్యతలో లోపాలు గుర్తించాం

మార్పులు చేశామన్న టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి):శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతలో లోపాలు గుర్తించామని, వాటి నాణ్యత పెంపుకోసం ఇప్పటికే చాలా మార్పులు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.క్యూలైన్లో భక్తులకు ఆహారపదార్థాలు, పిల్లలకు పాలు అందడం లేదని, సాంబారన్నం నాణ్యత బాగలేదని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరని ఫిర్యాదులందిన క్రమంలో క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయం ఆహారపదార్థాలు అందించేందుకు ప్రత్యేకంగా మూడు షిఫ్టుల్లో ఏఈవో స్థాయి అధికారులను నియమించామన్నారు.మరుగుదొడ్లను రెట్టింపు చేయడంతో పాటు కొన్ని చోట్ల శాశ్వత క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పదార్థాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నారని,అయితే అవి ఆర్గానిక్ కాదనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.కాబట్టి సేంద్రియ పదార్థాలా కాదా అనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రైస్, సాంబారు, మజ్జిగ వంటి పదార్థాల్లో నాణ్యత కనిపించలేదన్నారు.నూకల బియ్యం వస్తున్నాయని తెలిసి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.లడ్డూకి రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ముఖ్యమని, ముడిసరుకుల్లో ఉన్న లోపాలను కూడా గుర్తించామన్నారు.ఇకపై బెస్ట్ క్వాలిటీ నెయ్యి తెప్పించి, గతంలో స్వామి లడ్డూకి ఉండిన వైభవాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.ఇకపై నాణ్యత కలిగిన ముడిసరుకులు ఇవ్వకపోతే జరిమానా విధిస్తామన్నారు.తిరుమలలో కొన్ని రెస్టారెంట్లు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. కనీసం పరిశుభ్రత పాటించకపోవడంతో పాటు నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను భక్తులకు విక్రయిస్తున్నారన్నారు. ఇకపై తక్కువ ధరలతో పాటు నాణ్యత ఉండాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించామన్నారు. రెస్టారెంట్లు తీసుకునేవారితో పాటు టూరిజం హోటళ్లను కూడా సబ్ లీజ్‌కు ఇవ్వకూడదనే నిబంధన పెడతామన్నారు. ప్రముఖ హోటళ్ల నిర్వాహకులకే ఇకపై రెస్టారెంట్లు కేటాయించే నిబంధన పెడతామన్నారు.గతంలో టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గతంలో అన్నప్రసాదాలు బాగాలేవని చెప్పిన భక్తులపై పెట్టిన కేసుల ఉపసంహరణపై పరిశీలిస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులు చాలా కష్టపడి పని చేస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

బషీర్‌కు ఎమ్మెల్యే అమర్ అభినందన



గంగవరం,జూలై 20: పర్యావరణాన్ని పరిరక్షించాలనే ధ్యేయంతో పలమనేరు నుంచి లడక్‌కు దిగ్విజయంగా సైకిల్ యాత్ర పూర్తిచేసి స్వగ్రామానికి చేరుకున్న బషీర్‌ను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభినందించి సన్మానించారు.లడక్‌యాత్ర పూర్తిచేసిన బషీర్ శుక్రవారం రాత్రి పలమనేరుకు చేరుకున్నారు. అతడికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పట్టణ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని బషీర్ గతనెల జూన్ 12వ తేదీన సైకిల్ యాత్ర ప్రారంభించి లడక్‌కు చేరుకొని, పలమనేరు ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేశారని కొనియాడారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సైకిల్‌పై వేల కిలోమీటర్లు సాగడం గర్వకారణమన్నారు.సమాజంలోని ప్రతిఒక్కరూ బషీర్‌ను ఆదర్శంగా తీసుకొని పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.

పూల దండలు, శాలువాలు వద్దు

ఆ డబ్బుతో నోటుపుస్తకాలు ఇవ్వండి!

పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

తవణంపల్లె, జూలై 20: 'నన్ను అభినందించడానికి, ఆహ్వానించడానికి పూలదండలు, శాలువాలతో రావద్దు' అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ విజ్ఞప్తి చేశా రు. ఆ డబ్బులతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, అవసరమైన సామగ్రిని అందజేయాలని ఆయన కోరారు. శనివారం తవణంపల్లి మండలంలోని 66 పాఠశాలల్లో ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవిమోహన్‌నాయుడు దంపతులు సుమారు రూ.3.5 లక్షలు విలువ గల నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అరగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలదండలు, శాలువాల కోసం రూ.5 వేలు నుంచి రూ.10 వేలు ఖర్చు అవుతోందని, ఇకపై ఈ డబ్బులతో విద్యా సామగ్రిని కొనుగోలు చేసి, బుక్ బ్యాంక్‌లో వేయాలని సూచించారు. అరగొండ బాలుర, బాలికల పాఠశాలల్లో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు ముందుకు వచ్చిన కొండ్రాజుకాల్వ సర్పంచ్ పరంధామనాయుడును ఎమ్మెల్యే అభినందించారు. డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, తహసీల్దార్ అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్ల రాజ్యంగా రాయలసీమ

ఓ సామాజిక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడం సీమ చరిత్రకు దర్పణం

బీఎస్పీ జోనల్ సమావేశంలో రిటైర్డు డీజీపీ పూర్ణచంద్రరావు



బీఎస్పీ సమావేశంలో ప్రసంగిస్తున్న పూర్ణచంద్రరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: రాయలసీమ రెడ్ల రాజ్యంగా మారిందనీ.. ఒక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడమే ఇక్కడి చరిత్రకు దర్పణమని రిటైర్డు డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన బీఎస్పీ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. బలిజలతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రాయలసీమలో 70 శాతం ఉన్నారని, అయితే కేవలం 8 శాతం మాత్రమే వున్న రెడ్డి సామాజిక వర్గం దశాబ్దాలుగా ఇతర కులాలను, మరీ ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలను ఎదగనీయకుండా అడ్డుపడుతోందన్నారు. ఒక వైపు భయపెడుతూ మరో వైపు దోచుకుంటూ అన్ని ప్రధాన పార్టీల్లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు రాజ్యమేలుతున్నారని వాపోయారు.గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మెజారిటీ స్థానాలు రెడ్లకే కేటాయించాయని ఆవేదన వ్యక్తం చేశారు.రిజర్వు సీట్ల వల్ల ఎస్సీలకు ఆ మాత్రం సీట్లున్నాయనీ, లేకపోతే వాటిని కూడా మాయం చేసి ఉంటారన్నారు.వైఎస్, పెద్దిరెడ్డి, జేసీ, భైరెడ్డి, నల్లారి, భూమన, శిల్పా, మేకపాటి తదితరుల వలలో చిక్కి రాయలసీమ సర్వనాశనం అయ్యిందన్నారు.కులగణన జరగకుండా సామాజిక న్యాయం జరగదని స్పష్టం చేశారు.బీఎస్పీ రాయలసీమ కో-ఆర్డినేటర్, రిటైర్డు జడ్జి గుర్రప్ప, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, ఉపాధ్యక్షులు గౌతం, నాయకులు మల్లిక, విజయకుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీ వార్షికోత్సవం

ఏర్పేడు, జూలై 20: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరవ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా కో ఫౌండర్ ఆఫ్ ఇన్ఫోసిస్ ఛైర్మన్ క్రిస్ గోపాలకృష్ణ, అతిథులుగా జెస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ హాజరుకానున్నట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. అతిథుల చేతుల మీదుగా ఐఐటీలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 8 దుంగల స్వాధీనం


స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 20: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీప్రాంతంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం శుక్రవారం అటవీ శాఖ సిబ్బందితో కలిసి సానిపాయ బేస్ క్యాంపు నుంచి రాయవరం మీదుగా ఆవుల దారి, సరస్వతి కటువ, ముదుంపాడు అటవీప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. అటవీప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకెళ్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయారు. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయతీకి చెందిన రమేష్(32)గా గుర్తించారు. అనంతరం సంఘటనా స్థలం నుంచి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాహు కేతు పూజల పేరుతో మోసం

- భక్తులను దగా చేస్తున్న దొంగస్వామి
- ప్రైవేటు లాడ్జీలే కేంద్రంగా సాగుతున్న తతంగం

శ్రీకాళహస్తి, జూలై 20: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఓ బురిడీ స్వామి భక్తులను నిలువునా దగా చేస్తున్నాడు. గత మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో దోష పరిహార పూజలు చేస్తానని నమ్మిస్తూ భారీగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నాడు. బాధితులు గగ్గోలు పెడుతూనే ఉన్నా ఇప్పటి వరకు అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. అడిగేవారే లేకపోవడంతో రాహుకేతు పూజల పేరుతో దొంగస్వామి తన మోసాలను కొనసాగిస్తూనే ఉన్నాడు. తాజాగా శుక్రవారం అనంతపురానికి చెందిన ఓ భక్తుడికి ఫోన్ చేసి దోషం పేరుతో భారీగా నగదు వసూలు చేసేందుకు విఫలయత్నం చేశాడు. అనంతపురానికి చెందిన నాగేంద్ర ఏప్రిల్ 4న శ్రీకాళహస్తికి విచ్చేశాడు. ముక్కంటి ఆలయంలో అర్చన విభాగంలో అటెండర్‌గా పనిచేసే ఓ ఉద్యోగికి సన్నిధివీధిలో ఉన్న లాడ్జీలో గదిని అద్దెకు తీసుకుని రాత్రి అక్కడే బస చేశాడు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం గోవిందశర్మ అనే పేరుతో ఓ వ్యక్తి నాగేంద్రకు ఫోన్ చేశాడు. ఫలాన తేదీన ముక్కంటి ఆలయంలో రాహుకేతు పూజలు జరిపించుకున్నారు కదా అని పరిచయం చేసుకున్నాడు. మీరు ఏ సమస్యపై రాహుకేతు పూజలు జరిపించు కున్నారంటూ విషయం రాబట్టాడు. వెంటనే ఫోన్‌పే ద్వారా 9063695327 నెంబరకు రూ.5,116 నగదు వేస్తే దోష పరిహారం కోసం పూజలు చేస్తానంటూ నమ్మించాడు. అప్పటికప్పుడే పూజ ప్రారంభం అవుతుందంటూ ఆలస్యం కాకుండా నగదు జమ చేయాలని నాగేంద్రను తొందరపెట్టాడు. అయితే తాను స్వయంగా శ్రీకాళహస్తికి వచ్చి నగదు చెల్లిస్తానని నాగేంద్ర చెప్పాడు. తాను ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రుల స్థాయివారితోనే మాట్లాడుతానని, నేరుగా కలిసేందుకు సమయం లేదంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. నాగేంద్ర శ్రీకాళహస్తిలోని తనకు పరిచయస్థులకు గోవిందశర్మ మాట్లాడిన వాయిస్ రికార్డును పంపాడు. నాగేంద్ర మిత్రుడు ఆరా తీయడంతో గోవిందశర్మ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశాడు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఆగని బరితెగింపు

శ్రీకాళహస్తిలోని లాడ్జీల్లో బసచేసే వారి వివరాలను ఓ ఆగంతకుడు మూడు సంవత్సరాలుగా సేకరిస్తున్నాడు. భక్తులు బసచేసిన మూడు నెలల తరువాత వారికి ఫోన్లుచేస్తూ తేదీ, ఊరు, పేరు, సమయంతో సహా భక్తులతో మాట్లాడు తున్నాడు. వివరాలు పూర్తిగా చెబుతూ శ్రీకాళహస్తీశ్వరాలాయనికి చెందిన స్వామిగా వందలాది మందిని నమ్మించి మోసం చేస్తున్నాడు. చాలా మంది భక్తులు పలుమార్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గతంలో గోవిందశర్మ మోసాలపై ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఆగంతకుడు మరింతగా బరితెగిస్తున్నాడు.

సీజనల్ వ్యాధులపై పోరాడాలి



మదనపల్లె సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ములకలచెరువుమందులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

మదనపల్లె టౌన్, జూలై 20: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది కలసికట్టుగా పోరాడాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక సుభాష్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులతోపాటు మున్సిపల్, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో డెంగ్యూ, డయేరియా, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని దీనిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని చర్చించారు. ముఖ్యంగా పట్టణంలో మురుగునీరు నిల్వ వుండే ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. నీరుగట్టువారిపల్లె, శివారు కాలనిలో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. కొన్ని హోటళ్లలో ముందురోజు మాంసాహారాలను ఫ్రిజ్‌లలో పెట్టి మరుసటిరోజు వండి పెడుతున్నారని, వాటిపై మున్సిపల్ అధికారులు తనిఖీలు చేసి అటువంటి హోటళ్లకు తాళాలు వేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో ఆదివారం ఓవర్‌హెడ్‌ట్యాంకు, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు శుభ్రపరిచే విధంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎక్కడైనా సీజనల్ వ్యాధులు సోకితే దానికి పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవోలు భానుప్రసాద్, షాలెట్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, సర్వజన బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదరాజు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

ములకలచెరువు, జూలై 20: వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో కొండయ్య ఆదేశించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, ఆస్పత్రిలో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ తనిఖీల్లో వైద్యులు జాహ్నవిరెడ్డి, రేష్మా, సీహెచ్‌వో షకీలాబేగం, ఎల్‌డీసీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



పంచాయతీ కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి నారా లోకేశ్‌కు అందచేస్తున్న పంచాయతీ కార్మికులు

పెద్దతిప్పసముద్రం జూలై 20: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్‌ను సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య, జిల్లా నాయకుడు ఎస్ సురేంద్రబాబు లు కలిసి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యను తక్షణం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వి. రాము, ఎం. నాగభూషణం, ఎస్. సురేంద్రబాబు, మధు, పశ్చిమగోదావరి శివరావు, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

● హత్యను ప్రమాదంగా చిత్రీకరించిన వైనం..!



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుర్రంకొండ, జూలై 20:హత్య కేసులో నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు వాల్మీకి పురం సీఐ పులిశేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు గుర్రంకొండ మండలం సంగసముద్రం గ్రామానికి చెందిన జి.రామక్రిష్ణ(48) గత నెల 10వ తేదీన సొంత పనుల నిమితం గుర్రంకొండకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఏనుగులచెరువు కట్టమీద రాత్రి 9 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో పోలీసులు గుర్తు తెలియని వాహనం ఢీకొని రామక్రిష్ణ మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐ సమగ్రంగా విచారణ చేయడంతో ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని పట్టుకున్న పోలీసులు వ్యక్తి మృతికి గల కారణాలు తెలుసుకోవడంతో అది ప్రమాదం కాదని వాహనంతో ఢీకొట్టి హత్యచేసినట్లు నిజాలు బయటపడ్డాయి. గ్రామానికి చెందిన ఓ మహిళతో మృతుడు రామక్రిష్ణకు వివాహేతర సంబంధం ఉందన్నారు. దీంతో మహిళ భర్త మల్లికార్జున తనకు, కుటుంబ సభ్యులకు గ్రామంలో అవమానం జరుగుతున్నట్లు గ్రహించాడు. దీంతో గ్రామానికి చెందిన మల్లికార్జున్(30), సద్దాంహుస్సేన్(34), ప్రకాశ్(42),వెంకటేష్(28)లతో కలిసి పథకం ప్రకారం గత నెల 10వ తేదిన ఏనుగులచెరువు కట్ట మీద ద్విచక్ర వాహనంపై వెళుతున్న రామక్రిష్ణను బొలెరో వాహనంతో ఢీకొట్టారు. దీంతో రామక్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందగా నిందితులు అక్కడ నుంచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి హత్యకు కారణమైన నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేసి వాల్మీకీపురం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

రామసముద్రం, జూలై 20: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన గంగప్ప భార్య ఎల్లమ్మ మెడలోని బంగారు గొలుసును ఓ గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపారు. ఎల్లమ్మ శనివారం ఉదయం వేకువజామున ఇంటిలో నుంచి బయటికి రాగా ఆ సమయంలో ముఖానికి మాస్క్ వేసుకున్న ఓ దుండగుడు తన మెడలోని గొలుసును లాక్కొని పారిపోయినట్లు ఆమె తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు చెప్పారు.

పొలం వివాదంపై విచారణ

బి.కొత్తకోట, జూలై 20: బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీలోని బుచ్చిరెడ్డిగారిపల్లె వద్ద వివాదాస్పద పొలాన్ని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్ రెడ్డి శనివారం పరిశీలించి విచారణ చేపట్టారు. గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 667లో తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని సాగుచేయకుండా అడ్డుకుంటున్నారని బి.కొత్తకోటకు చెందిన మహిళ అరుణ ఫిర్యాదు చేశారు. అదే విధంగా సదరు భూమిలో తమకు హక్కు ఉందని మరో వర్గం ఆమెపై ఫిర్యాదు చేసింది. ఈవివాదమై కొత్తకోట పోలీసులు ఇరువర్గాలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విషయమై డీఎస్పీ వివాదాస్పద భూమిని పరిశీలించి వివాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

సీతరగానిపల్లె రోడ్డు పనులు ప్రారంభం

రామసముద్రం, జూలై 20: రామసముద్రం పంచాయతీకి చెందిన సీతరగానిపల్లె రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. రోడ్డు దుస్థితిపై ఈనెల 9న 'దుస్థితిలో సీతరగానిపల్లె రోడ్డు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రోడ్డు మరమ్మత్తులకు మండల గ్రాంట్ కింద రూ.4లక్షలు మంజూరు చేయించడంతో మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు శనివారం రోడ్డు పనుల పునరుద్ధరణకు భూమి పూజ చేసి ప్రారంభించారు. దీంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, సర్పంచ్ కవితమ్మకు, విజయ్‌కుమార్‌గౌడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పి.సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, కృష్ణప్ప పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

మదనపల్లె టౌన్, జూలై 20: ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని, ఇదిచట్టపరంగా నేరమని పిల్లల తల్లిదండ్రులు కూడా శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శైలజ, అధ్యాపకులు డి.శ్రీనివాసులు, రాఘవరెడ్డి, జి.చిన్నారెడ్డి. ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్యవర్గం ఎంపిక

మదనపల్లె, జూలై 20: మద నపల్లె మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూని యన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక చేపట్టారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్ర మంలో అధ్యక్షునిగా వాసు, కార్యదర్శిగా ఎస్.ముబారక్‌లను కార్మికుల సమక్షంలో జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.మస్తాన్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా ఎప్పటికప్పుడు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సంజీ వ, మిఠాయి శీన పాల్గొన్నారు.

ఎస్సీ కులాన్ని బీసీగా మార్చిన వలంటీర్..



ఎస్సీ కులం సర్టిఫికెట్ కోసం తహసీల్దార్‌ను కలిసిన శిరీష

రామసముద్రం, జూలై 20: ఎస్సీ కులానికి చెందిన విద్యార్థిని బీసీఏగా మార్చిన వలంటీర్ నిర్వాకం ఆలస్యంగా వెలుగు చూసింది. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ నారేవారిపల్లెకు చెందిన మంజునాథ్ ఎస్సీ వర్గానికి చెందిన వాడు. ఇతని కుమార్తె ఎస్.శిరీష కులం సర్టిఫికెట్ కోసం గత ప్రభుత్వం 2023 జనవరి 30న నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంది. అయితే ఈగ్రామానికి చెందిన వలంటీర్ అనూష తన లాగిన్‌లో శిరీష కులమును ఏకీల కులం బీసీగా అప్లోడ్ చేసింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న శిరీష జరిగిన విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు తెలియజేసి తనకు ఎస్సీ కులం సర్టిఫికెట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

కలికిరి, జూలై 20: ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన కిట్లను శనివారం కలికిరి మండలంలో అధికారులు పంపిణీ ప్రారంభించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ తెలుగు పాఠశాలలోని విద్యార్థులకు ఆ కిట్లను ఎంఈవో కరీముల్లా, సర్పంచ్ ఎల్లయ్య విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురాషా వలి, సీఆర్‌పీ సురేశ్, స్థానికులు యోగేశ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'రూ. 7 లక్షలు కాజేసిన గ్రూపు లీడర్'

పెద్దతిప్పసముద్రం జూలై 20 : మండల కేంద్రమైన పీటీఎంలోని వాణి వినాయక గ్రూపు లీడర్ రూ.7లక్షలు కాజేసినట్లు సంఘం సభ్యులు ఆరోపించారు. గ్రూపులో మొదటి లీడర్‌గా ఉన్న నాగలక్ష్మి ప్రతి నెలా గ్రూపు సభ్యులు ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణానికి సంబంధించిన నగదును జమ చేసేవారన్నారు. అయితే ఆమె వారి వద్ద నుంచి వసూలైన సొమ్మును బ్యాంకులో కొంత మాత్రమే జమ చేసి మిగతా సొమ్మును సొంత అవసరాలకు వాడుకుందన్నారు. కొంతమంది సభ్యులకు అనుమానం రావడంతో బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా లీడర్ వసూలు చేసిన సొమ్ములో రూ. 7,87,773 ఆమె కట్టలే దని తేలిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని గ్రూపు సభ్యులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నిమ్మనపల్లి, జూలై 20: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టిక ఆహారంతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సీడీపీవో సజాత పేర్కొన్నారు. శనివారం ఆమె పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు రకతహీనతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సమయ పాటించాలని లేని పక్షంలో చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

జగన్‌రెడ్డీ..ఇకనైనా శవ రాజకీయాలు మానుకో...

ములకలచెరువు, జూలై 20: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు చేయడం ఇకనైనా మానుకోవాలని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. శనివారం జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండలో రషీద్ అనే యువకుడ్ని వైసీపీకే చెందిన జిలానీ అనే యువకుడు హత్య చేస్తే దీన్ని టీడీపీపై రుద్దాలని చూడడం అవివేకమన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లిచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తీరు మారలేదన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ షేక్ మహిరా, నాయకులు చాంద్‌బాషా మస్తాన్, బుర్రారమణ, రవీందర్‌నాయుడు, శేఖర్‌నాయుడు, అల్లాబక్షు, కృష్ణమూర్తి, సత్తార్‌సాబ్, సుధాకర్, తిరుపాల్, చంద్ర, మౌలాసాహెబ్, రామదాసు, షామీర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపండి

రామసముద్రం, జూలై 20: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టి సీజనల్ వ్యాధులు నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా అందరూ మట్టి విగ్రహాలు తయారు చేసుకునే విధంగా నిర్వాహకులను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం మట్లవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశమై వినాయక చవితి సందర్భంగా రసాయనాలతో కూడిన విగ్రహాల వాడకం వల్ల పర్యావరణకు కలిగే నష్టాలను తల్లిదండ్రులకు వివరించి అందరూ మట్టి విగ్రహాలు ఉపయోగించేలా పోత్సహించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఇదే గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు.

చల్లావారిపల్లె రేషన్ షాపు రద్దు

పెద్దతిప్పసముద్రం జూలై 20 : మండలంలోని బూర్లపల్లె పంచాయతీ చల్లావారిపల్లె రేషన్ షాపును రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. ఇటీవల రేషన్ షాపులో రేషన్ సరుకులు సక్రమంగా అందించడం లేదని కార్డుదారులు రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేయడంతో ఈ నెల 18న తహసీల్దార్, ఉపతహసీల్దార్‌లు చల్లావారిపల్లెకు వెళ్లి షాపు నంబర్ 6లో తనిఖీ నిర్వహించగా 69 కేజీల కందిపప్పుతో పాటు 305 కేజీల బియ్యం పక్కదోవ పట్టినట్లు గుర్తించారు. రేషన్ డీలర్ శివప్పపై 6ఏ కేసు నమోదు చేసి మదనపల్లె జాయింట్ కలెక్టర్‌కు రెఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్డుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వేరే డీలర్‌ను ప్రభుత్వం నియమించే వరకు సంబంధిత వీఆర్వోకు బాధ్యతలు అప్పగించి కార్డుదారులకు సరుకులు అందచేయనున్నట్లు తెలిపారు.

కలికిరి జేఎన్‌టీయూ రిజిస్ట్రారుగా కృష్ణయ్య

కలికిరి, జూలై 20: కలికిరిలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల రిజిస్ట్రారుగా ప్రొఫెసర్ కృష్ణయ్య మరోమారు నియమితులయ్యారు. గతంలో అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల రిజిస్ట్రార్‌గా చాలా కాలం ఆయన పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. అయితే ఇటీవలే ఆయనను కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగాధిపతిగా నియమించారు. తిరిగి ఇప్పుడు ఆయన రిజిస్ట్రార్ పదవి చేపట్టనున్నారు.

ఆటో బోల్తా .. పలువురికి గాయాలు

కురబలకోట, జులై 20:ఆటో బోల్తా పడ్డ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తంబళ్ళపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన పలువురు కూలీలు మండలంలోని ముదివేడు క్రాస్ సమీపంలో టమోటా కాయలు కోయడానికి వచ్చారు. కాగా అక్కడ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఆటో బోల్తా పడటంతో పలువురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో వారిని మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. ముదివేడు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరులో కుక్కల పంచాయితీ

● వాట్సప్ గ్రూపుల్లో సర్పంచ్, శానిటరీ అధికారి ఆరోపణలు

పీలేరు, జూలై 20: పీలేరు గ్రామ పంచాయతీలో కుక్కలను పట్టే పంచాయితీ సర్పంచ్, శానిటరీ అధికారి మధ్య ఆరోపణలకు దారితీసింది. పంచాయతీ పరిపాలనను సజావుగా సాగించాల్సిన వారిద్దరి మధ్యా ఏం తేడా కొట్టిందో తెలియదు గానీ ఒకరిపై మరొకరు వాట్సప్ గ్రూపుల్లో విమర్శలు చేసుకుంటూ అభాసుపాలవుతున్నారు. పీలేరు సర్పంచ్ జీనత్ షఫీ, శానిటరీ అధికారి రవి మధ్య నెలకొన్న వివాదం పీలేరులో శనివారం చర్చనీయాంశమైంది. పట్టణంలో పెరిగిన కుక్కల బెడదను తప్పించడానికి తాము తిరుపతి నుంచి కుక్కలు పట్టేవాళ్లను(షికారీలు) పిలిపించి పట్టిన ఒక్కో కుక్కకు రూ.450లలో పీలేరు శానిటరీ అధికారి రవి రూ.200లు కమీషన్ తీసుకున్నట్లు షికారీలు తెలిపారని సర్పంచ్ తన వాట్సప్ సందేశంలో పేర్కొన్నారు. ఈ దఫా ఎటువంటి కమీషన్లు లేకుండా తమకే నేరుగా పేమెంట్ ఇస్తేనే కుక్కలు పడతామని వారు కండీషన్ విధించారని, ఈ నేపథ్యంలో పట్టణంలో సోమవారం నుంచి కుక్కలు పట్టే కార్యక్రమం చేపడతామని ఆమె అందులో తెలిపారు. కాగా గతంలో ఆన్‌లైన్‌లో జరిగిన పేమెంట్లలో తాను కమీషన్ ఎలా తీసుకోగలనని రవి తెలుపడంతో ఒక్కసారిగా పీలేరు వాట్సప్ గ్రూపుల్లో చర్చనీయాంశం అయ్యింది.

కార్మికులంతా ఏకం కావాలి

మదనపల్లె అర్బన్, జూలై20: అసమాన వ్యవస్థను మార్చేందుకు కార్మికులంతా ఏకం కావాలని సీపీఎం నాయకుడు మురళి పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లిలో సీపీఎం జిల్లాస్థాయి శిక్షణా తరగతులు ప్రారంభించారు. జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మురళి మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ కొద్దిమందిని మాత్రమే సంపన్నులుగా చేస్తోందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లాకార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, రామచంద్ర, నాగరాజు, వెంకటయ్య, రమేశ్‌బాబు, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టండి

మదనపల్లె అర్బన్, జూలై20: జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికటాట్టలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు కోరారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఇసుక, మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్నారు. దీనిని అరికట్టడానికి సంబంధింత అధికారులు వైఫల్యం చెందారని ఆయన పేర్కొన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేశారని తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో కోట్ల భూములు అక్రమణకు గురయ్యాయని, ప్రభుత్వ భూములను ఆక్రమణ దారుల నుంచి కాపాడడానికి ప్రభుత్వం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, వేణుగోపాల్‌రెడ్డి, సలీంభాష, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని రాజ్యసభ నుంచి బర్తరఫ్ చేయండి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ, ప్రజాసంఘాల నేతలు

పీలేరు, జూలై 20: మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని రాజ్యసభ నుంచి బర్తరఫ్ చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ శనివారం పీలేరులోని అంబేడ్కర్ కూడలిలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అమృతతేజ మాట్లాడుతూ పెద్దల సభగా పేరుగాంచిన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసాయిరెడ్డి చాలా చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని పాత్రికేయులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, అలా చెప్పని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ చేపట్టిన నిరసన కార్యక్రమానికి పీలేరు ప్రెస్ క్లబ్, మాలమహానాడు, ఏఐవైఎఫ్, టీడీపీ వీసీకే పార్టీ, బాస్ మద్దతు ప్రకటించి నిరసనలో పాల్గొన్నాయి. అనంతరం వారందరూ విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్ కుమార్, అఖిల్, రెడ్డి, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, జెట్టి మల్లికార్జున, లోకనాథం, ఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీఎల్ వెంకటేశ్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సుభాష్, వీసీకే పార్టీ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్లెల జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు నడక ఆరోగ్యానికి మంచిది

మదనపల్లె టౌన్, జూలై 20: ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో 40 నిమిషాలు నడిస్తే ఆరోగ్యానికి చాలా మంచిదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక బీటీ కళాశాల మైదానంలో స్వాస్థ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో 3 కిలోమీటర్ల వాకథాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దైనందిన కార్యక్రమాల్లో బిజీగా వుండే పట్టణ పౌరులు, ఒత్తిడితో బీపీ, మధుమేహం వంటి వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు రోజు 40 నిమిషాల వ్యాయామం, నడక చేయాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వైఎస్ మునిరత్నమయ్య, సంగం శ్రీనివాసులు, సత్సంగ్ ఫౌండేషన్ సభ్యుడు మహేంద్ర, వెంకి నటరాజ్, స్వాస్థ్య ఆస్పత్రి వైద్యులు ప్రియం, కృష్ణతేజ, మార్కెటింగ్ ప్రతినిధి పవన్, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ల ఆపరేటర్లు బాధ్యతగా పనిచేయాలి

మదనపల్లె టౌన్, జూలై 20: సబ్‌స్టేషన్‌ల లో విధులు నిర్వహించే డ్యూటీ ఆపరేట ర్లు, షిఫ్ట్ ఆపరేటర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీడీసీఎల్ (టీఆర్ఈ) డీఈ బాబు సూచించారు. శనివారం స్థాని క ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో మదనపల్లె, తంబ ళ్లపల్లె నియోజవర్గాలోని అన్ని మండలాల సబ్‌స్టేషన్‌ల డ్యూటీ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డీఈ బాబు మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లలో ఏవైనా మరమ్మతులు చోటుచేసుకుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సాధ్యమైనంత వరకు వారే చిన్న సమ స్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా గాలి, వానల సమయంలో సబ్‌స్టేషన్‌లలో ఉన్న సాంకేతికత వ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. ఎస్పీడీసీఎల్ టౌన్, రూరల్ ఏడీఈలు రుక్మాంగదబాబు, సురేంద్రనాయక్, ప్రొటెక్షన్ ఏఈ అజయ్‌బాబు, మదనపల్లె ఏఈలు రెడ్డికుమార్, రమేశ్‌బాబు, నరసింహారెడ్డి, గోవిందరెడ్డి, రిటైర్డ్ ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి సంచార ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

కలికిరి, జూలై 20: కలికిరి మండలంలో ఈ నెల 23వ తేదీ నుంచి సంచార ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. 23న కలికిరిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మునేళ్లపల్లెలోని సచివాలయం, 24న ఇంది రమ్మ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాల, మర్రికుంటపల్లె సచివాలయం, 25న కలికిరి లోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, పల్లవోలు సచివాలయం, 26న కలికిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుండ్లూరు సచివాలయం, 27న కలికిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహల్‌లోని జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం ఎంపీడీవో వెంకటరమణయ్య వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆధార్ క్యాంపు ద్వారా ఆధార్ కార్డు డాక్యుమెంట్ అప్డేట్, బయోమెట్రిక్ సర్వీసులు, కొత్త ఆధార్ కార్డు నమోదు కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. 23న పెద్దమండ్యం ప్రాథమిక పాఠశాల, 24న కలిచెర్ల జూనియర్ కాలేజీ, 25న కలిచెర్ల పాతూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాల, 26న కలిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాల, 27న కోటకాడపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

మండల అధికారుల తీరుపై ఎంపీడీవో ఆగ్రహం

నిమ్మనపల్లి, జూలై 20: సమయపాలన పాటించని మండల స్థాయి అధికా రులపై ఎంపీడీవో శాలెట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థా యి అధికారులు 11గంటలకు రావాల్సి వుండగా కొందరు 12గంటలకు హాజరయ్యారు. దీంతో ఆగ్రహించిన ఎంపీడీవో వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ఆలస్యంగా రావడంతో వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారుల సమాధానాలు చెప్పారు. అదే విధంగా వచ్చే వినాయకచవితి పండుగకు మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమేష్, ట్రాన్స్‌కో ఏఈ వసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నిమ్మనపల్లి, జూలై 20: జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టినట్లు పార్టీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక పంచాయతిలో జన సేన కార్యకర్తల నుంచి పార్టీ సభ్య త్వాన్ని నమోదు కార్యక్రమాన్ని ప్రా రంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18నుంచి 28వరకు జనసేన పా ర్టీ తరపున సభ్యత్వాలను నమోదు చేస్తున్నామన్నారు. సభ్యత్వం కలిగిన వ్యక్తికి రూ.5లక్షల వరకు బీమా పాలసీ, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50వేలను జన సేన పార్టీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భరత్, శవకుమార్, నవీన్, సాయి, గోపాల్, హరి, సుధాకర్, హర్షవర్ధన్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి

తంబళ్లపల్లె, జూలై 20: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించే విధంగా ప్రోత్సహించాలని పీడీ మద్దిలేటి ఉపాధి సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని కుక్కరాజుపల్లె గ్రామం కుమ్మరపల్లెలో ఉపాధి కూలీలు చేపడుతున్న ఫారంపాండ్ పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ...ఉపాధి పథకం ద్వారా పండ్లు, పూలతోటలు, పశుగ్రాసం పెంపకం చేపట్టే రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కూలీలు కోరిన వెంటనే పనులు చూపించి, ఎక్కువ మంది పనుల్లో పాల్గొనే విధంగా కృషి చేయాలన్నారు. కూలీలు చేసిన పనులకు వెంటనే కొలతలు తీసి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా కృషిచేయాలన్నారు. భూగర్భజలాల పెంపునకు ఫారంపాండ్లు, పర్యావరణ పరిరక్షణకు రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించడంపై ఉపాధి సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. అనంతరం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీడీ మధుబాబు మాట్లాడుతూ..కూలీలకు రావాల్సిన బకాయిలు త్వరలో అందటానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ టీఏ బాలాజీ, ఏపీవో అంజినప్ప, జేఈ రామన్న, టీఏలు వెంకట్రమణ, శేఖరమ్మ, నాగార్జున, ఎఫ్ఏ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటపల్లె పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు



కోటపల్లె పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, జూలై 20: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు తహసీల్దారు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో తలపుల పీహెచ్‌సీ సిబ్బంది శనివారం పీలేరులోని కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం పాఠశాల సందర్శనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు తమలో చాలా మందికి చర్మ సంబంధిత సమస్యలు ఉన్నట్లు విద్యార్థులు తెలపడం, అందుకు ప్రతిస్పందనగా ఆయన పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాల్సిందిగా తహసీల్దారును ఆదేశించడం పాఠకులకు తెలిసిం దే. కలెక్టర్ ఆదేశాల మేరకు తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని చర్మ వ్యాధి నిపుణుడు కరీముల్లా వసతి గృహంలోని 46 మంది విద్యా ర్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 24 మంది విద్యార్థులు చర్మ సంబంధిత సమ స్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివశం కరయ్య, పీఈటీ నారాయణ రెడ్డి, హెచ్ఈ కొండయ్య, సూపర్‌వైజర్లు కుసుమ, కృష్ణయ్య, ఏఎన్ఎం, సీహెచ్‌వో , ఆశాలు పాల్గొన్నారు.